క్లుప్తంగా

యోగభోగేశ్వరుడికి వెండి పాత్ర వితరణ

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి నిత్య నైవేద్యం కోసం ఎస్‌బీఐ కాలనీకిచెందిన రాటకొండ రవీంద్ర,హేమలత దంపతులు వెండి పాత్ర వితరణ చేశారు. ఆలయంలో ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్‌కు సుమారు రూ.80 వేలు విలువ చేసే పాత్ర అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది అంకన్న పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ మండల కన్వీనర్‌గా మహేష్

పీలేరురూరల్ : ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘమైన ఎంఎస్‌పీ పీలేరు మండల కన్వీనర్‌గా ఎర్రబల్లి మహేష్ మాదిగ నియమితులయ్యారు. దీంతో మంగళవారం ఆయన్ను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అశోక్, సుధాకర్, ముల్లంగి చంద్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఐకమత్యంతో మెలగాలి

కలికిరి: గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో మెలగాలని వాల్మీకిపురం సీఐ సురేష్ కుమార్ అన్నారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుట్టపాళెం గ్రామంలో సోమవారం రాత్రి బసచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన ఆయన చిన్న చిన్న తగాదాలలో క్షణికావేశాలకు గురై జీవితాలను అంధకారం చేసుకోకూడదన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతాల ఓటీపీలు అపరిచిత ఫోన్‌కాల్ వారికి చెప్పకూడదన్నారు. ప్రతి మొబైల్‌దారు దిశ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద సమయాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి, ఎస్ఐ కె.రహీముల్లా, హెచ్‌సీ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాప్‌కట్టర్స్ పంపిణీ

తంబళ్లపల్లె: పశువైద్య కేంద్రంలో ఏడీ డాక్టర్ సుమిత్ర త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సబ్సిడీతో మంజూరైన చాప్‌కటర్స్(గడ్డి కత్తెరించే)యంత్రాలను రైతులకు అందజేశారు. తంబళ్లపల్లెలో 20 మంది, పెద్దమండ్యంలో 14 మందికి అందజేశారు. ఒక్కో యంత్రం ధర రూ.33,970లు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.13,588 పోనూ రైతు వాటా రూ.23,382లు చెల్లించిన వారికి యంత్రాలు అందజేశారు. మండల కోప్షన్ సభ్యులు జమాల్‌బాషా, వైస్ ఎంపీపీ కరీమ్, రామూర్తి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ములకలచెరువు: ములకలచెరువు మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. కమిటీ మండలాధ్యక్షుడిగా ఆశీర్వాదం, ప్రధాన కార్యదర్శిగా అనీల్ కుమార్‌లను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆనంద్‌రెడ్డి, రామచంద్ర, మహ్మద్ రఫీ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

హైదరాబాదు బస్సు సర్వీసు బీహెచ్‌ఈఎల్ వరకు..

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి హైదరాబాదు వెళ్లే ఆర్టీసీ స్టార్‌లైనర్ స్లీపర్ బస్సు బుధవారం నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు పొడిగించినట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు బీహెచ్‌ఈఎల్ వరకు నడపనున్నట్లు తెలిపారు.ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

అక్రమ వసూళ్లు అవాస్తవం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చంద్రాకాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ పేరుతో అక్రమ వసూళ్లు చేయలేదని, ఇది పూర్తిగా అవాస్తమని పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధర తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొందరు పేరెంట్స్ కమిటీ పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్నారనే వార్తలను ఖండించారు. పాఠశాలలో ప్రతి నెల రెండో ఆదివారం పేరెంట్స్ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడం వల్ల కోతులు, ఇతర జంతులు పాఠశాల ఆవరణంలోకి రావడం పేరెంట్స్ గమనించారన్నారు. దీని నివారణకు పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి అందరూ కలిసి పెన్సింగ్ వేయడానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఉపాధ్యాయుల పాత్ర లేదని స్పష్టం చేశారు.

అన్ని మతాల త్యాగఫలమే స్వాతంత్ర్యం

గుర్రంకొండ: సమాజంలో అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు, నాయకుల ప్రాణాల త్యాగ ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని జమాతే ఇస్లామీ-హింద్ రాష్ట్రశాఖ అధ్యక్షులు రఫీఖ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖండ్రిగ గ్రామంలో ఆసంస్థ జిల్లా కార్యవర్గసమావేశాలు మొదటిసారిగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని మతాల వారు అన్నదమ్ముల్లా కలసి మెలసి జీవిస్తేనే శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. దేశంలో అశాంతిని రగల్చడానికి కొంతమంది ప్రయత్నించడం బాధాకరమన్నారు. రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు స్వేచ్ఛా సమానత్వ హక్కులు ఉన్నాయన్నారు జమాతే ఇస్లామీ-హింద్ రాష్ట్ర కార్యదర్శులు కరీముద్దీన్ సాహేబ్, యాసీర్, జిల్లా అధ్యక్షుడు ఆజంఆలీఖాన్, సర్ఫాజీ జలీల్‌ఖాన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

త్యాగధనుల ఫలితమే దేశ స్వాతంత్ర్యం

- భిన్నత్వంలో ఏకత్వమే భారత్ బలం
- ఘనంగా 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు
- జెండా ఎగురవేసి వందన సమర్పణ చేసిన ఎమ్మెల్యే, ఆర్డీఓ



మదనపల్లె : స్వాతంత్ర్యదినోత్స వేడకల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి తదితరులు,



వాల్మీకిపురం: జాతీయ జెండాతో ర్యాలీ

మదనపల్లె : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ స్వాతంత్ర్యం ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. మంగళవారం 77వ భారత స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఊరూరా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో మువ్వన్నెల జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల సేవలను కొనియాడారు. భరతమాత సేవలో ప్రతి ఒక్కరూ తరించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన మున్సిపాలిటీలో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిల్‌సభ్యులతో కలిసి మహాత్మాగాంధీ, భరతమాత విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వమే భారత్ బలమని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, సంక్షేమపథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, బెంగళూరురోడ్డులోని ఈద్గామైదానం, విజయభారతి హైస్కూల్, జెడ్పీహైస్కూల్‌లో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మదనపల్లె డివిజన్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ప్రశంసాపత్రాలు అందించారు. ఎంపీపీ రెడ్డెమ్మ, సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి జెండా ఎగురవేశారు స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా స్వస్థ్య ఆస్పత్రి ముఖ్యకార్యనిర్వహణాధికారి డాక్టర్.శ్రీనివాస్ కండి ఆధ్వర్యంలో నక్కలదిన్నె సత్సంగ్ ఆశ్రమ ఆవరణలో జెండా ఎగురవేసి, ఆధ్యాత్మికగురువులు శ్రీఎం(ముంతాజ్ అలీ) స్ఫూర్తితో పట్టణంలో స్వాతంత్ర్యం-ఆరోగ్యం పేరుతో వాకథాన్ నిర్వహించారు. స్థానిక ఉర్దూఅకాడమీ గ్రంథాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్ జెండా ఎగురవేశారు. ఆర్టీసీ వన్‌డిపోలో మేనేజర్ వెంకటరమణారెడ్డి జెండా ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో షేక్‌మహబూబ్ చాంద్, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లలో సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, సత్యనారాయణ తదితరులు జెండా ఎగురవేశారు.

నిమ్మనపల్లెలో..

మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు, ఎంపీడీఓ శేషగిరిరావు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు పద్మావతి, నారాయణ, పీహెచ్‌సీలో డాక్టర్.దీక్షితారాణి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ, గ్రామసచివాలయాల్లో సర్పంచులు జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

రామసముద్రంలో..

మండలంలో 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ నారాయణస్వామి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ దైవరాజన్, ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ గౌరీశంకర్, మువ్వన్నెల జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. టైలర్ల ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయజెండాను ఊరేగించారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పీలేరు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం పీలేరులో ఘనంగా జరుపుకున్నారు. పీలేరు కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్, సీఐ కార్యాలయంలో సిఐ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ధనుంజయులు, మార్కెట్ యార్డు ఆవరణలో ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, పంచాయతీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, డాక్టర్ వెంక్రటామయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ డిపోలో డీఎం కుమార్, కోటపల్లె క్రాస్‌లో జి.వి. రాకేష్‌రెడ్డి, పాతబస్టాండులో మాజీ సైనికులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

కలికిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో వాడ వాడలా మువ్వన్నెల జెండా మంగళవారం రెపరెపలాడింది. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ జాతీయ జెండా ఆవిష్కరించారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ కేంద్రాలలో కమాండెంట్‌లు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిపై ప్రసంగించారు. సైనిక పాఠశాలలో ప్రిన్సిపాల్ కెప్టెన్ సీఎస్ పరదేశి జాతీయ జెండా ఆవిష్కరించి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించి విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు జాతీయ జెండా ఎగురవేశారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ద్విచక్రవాహన ర్యాలీ చేశారు.

గుర్రంకొండ కోటలో..

గుర్రంకొండ: మండలంలోని చారిత్రాత్మాక గుర్రంకొండ కోటతో పాటు అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం గుర్రంకొండకోటలో 50 అడుగుల ప్రత్యేక జాతీయజెండా దిమ్మెను ఏర్పాటు చేసి జాతీయ జెండాను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ, తరిగొండ జెడ్పీ హైస్కూల్లో జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఖాజాబీ, సింగిల్‌విండో కార్యాలయంలో సింగిల్‌విండో అధ్యక్షులు నక్కాచంద్రశేఖర్, గుర్రంకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ కొండేటిసుమలతలు జాతీయజెండాలను ఎగుర వేశారు. తరిగొండ జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్ బహుమతులను ప్రదానం చేశారు.

మువ్వన్నెల రెపరెపలు

వాల్మీకిపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేశారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, పంచాయతీ కార్యాలయంలో ఈఓ ఉదయ్ కుమార్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్ఈబి స్టేషన్‌లో సీఐ శివసాగర్ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ జాతీయ పతాకానికి గౌరవ వందనం చేసి, చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

కురబలకోట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో రాష్ట్ర విద్యా కమిటీ సభ్యులు బి. ఈశ్వరయ్య, ఎంపీపీ బి. దస్తగిరి పాల్గొన్నారు.స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని కోరారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు, ముదివేడు స్టేషన్‌లో ఎస్ఐ ముబీన్ తాజ్, కడప క్రాస్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు క్రాస్ నారాయణరెడ్డి, ముదివేడులో అంజాద్‌ఖాన్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, విద్యా శాఖ కార్యాలయం వద్ద ఎంఈఓ ద్వారకనాథ్ జెండాను ఎగుర వేశారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, గ్రామాల్లోని పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. మండలంలోని 16 సచివాలయాల్లో సర్పంచులు, కార్యదర్శులు జెండా ఎగరవేశారు. అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ అశ్విని ,ఎస్ఐ గాయత్రి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులు, సచివాలయాలు, పోలీస్ స్టేషన్, సబ్ స్టేషన్, ఆసుపత్రుల్లో మంగళవారం పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎంఈఓ నారాయణతో పాటు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా జెండా పండుగ

కేవీపల్లె : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. కేవీపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, గాలివారిపల్లె, ఎంవీపల్లె, కేవీపల్లెలో సర్పంచ్‌లు రాంప్రసాద్‌నాయుడు, రత్నాకర్‌రెడ్డి, నాగలక్ష్మీ, గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

300 అడుగుల జాతీయ పతాకం ప్రదర్శన

బి.కొత్తకోట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం బి.కొత్తకోటలో 300 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు ఈ పతాకాన్ని పీటీఎంరోడ్డు నుంచి పట్టణ ప్రధాన మార్గాల్లో ప్రదర్శించారు. ఎంపీడీఓ శంకరయ్య, జెడ్పీటీసీ రామచంద్ర, ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ, కోఆప్షన్ నాసీర్‌వలీ, వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధసంఘాలు పాల్గొన్నాయి. తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, ఏఈ గిరిధర్, ఎస్ఐ రామమోహన్, మేనేజర్ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్ వారి కార్యాలయాల్లో జాతీయపతాకాలను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

పెద్దమండ్యంలో ..

పెద్దమండ్యం: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం వాడ వాడలా అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గుర్రం పూర్ణ చంద్రిక, కలిచెర్ల తెలుగు ఉన్నత పాఠశాలలో కలిచెర్ల సింగిల్ విండో చైర్మన్ కడప సుధాకరరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాము, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామాంజనేయుడు, వెలిగల్లు ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె. ఆనందరెడ్డి, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ రామాంజులునాయక్, కలిచెర్ల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాయుని అమరనాథ్ జాతీయ జెండాను ఎగురవేశారు. దేశనాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాతో పెద్దమండ్యం, కలిచెర్ల పురవీధులలో విద్యార్థులు ర్యాలీలు చేశారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: స్వాతంత్ర్యం దినోత్సవంలో భాగంగా ఊరూవాడ మువ్వనెల జెండా రెపరెపలాడింది. స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ త్రివర్ణపతాకాన్ని ఎగరవేసి జెండా వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేష్‌రెడ్డి, వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ పావని జెండాను ఎగురవేశారు. దేశనాయకులు వేషధారణలో విద్యార్థులు ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కలకడలో..

కలకడ : మండలంలోన్ని అన్ని గ్రామాల్లో మువ్వన్నెల జెండ రెపరెపలాడింది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రదీప్, సింగిల్‌విండో కార్యాలయంలో వెంకట్రమణరెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి, సర్పంచ్‌లు, పాఠశాలల్లో ఆయా పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్‌లు జెండ ఆవిష్కరణ చేశారు. కలకడ-పీలేరు రోడ్డుమార్గంలో పాఠశాల విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. కోన ఉన్నత పాఠశాలలో భారతదేశ చిత్రపటం మొక్కలతో ఏర్పాటు చేశారు.



నిమ్మనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో..



పీలేరు : జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి



కేవీపల్లె : ఏపీఆర్‌జేసీలో జాతీయ జెండాకు వందనం



గుర్రంకొండ: జాతీయజెండాను ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్



కలకడ : జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, తదితరులు









ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న నాయకులు , కలికిరి: సైనిక పాఠాశాలలో విద్యార్థుల విన్యాసాలు, వాల్మీకిపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే చింతల









ముదివేడు మోడల్ స్కూల్లో స్వాతంత్ర్య వేడుకలు , ములకలచెరువు: జెండా ఎగరవేస్తున్న ఎస్ఐ గాయత్రి , బి.కొత్తకోటలో 300 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన ,

తంబళ్లపల్లె : జెండాను ఆవిష్కరిస్తున్న జడ్జి ఉమర్‌ఫరూఖ్

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నవరత్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలోనూ సంతోషం నెలకుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం సాయంత్రం నిమ్మనపల్లె పంచాయతీలోని ఉప్పరపల్లె, ఎద్దులవారిపల్లె, దండువారిపల్లె, పెద్దమాదిగపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. బుక్‌లెట్‌ను అందించారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పలుకరిస్తూ, అప్యాయంగా యోగక్షేమాలు విచారించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఉప్పరపల్లె, దండువారిపల్లె, ఎద్దులవారిపల్లె గ్రామాలకు నూతనంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు.




లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

అంతేకాకుండా తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్‌స్తంభాల ఏర్పాటు, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించేలా అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నారన్నారు. ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందన్నారు. జగనన్న పాలనను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు, అబద్ధపు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుని మనుగడ కోసం పాకులాడుతున్నాయని అన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకెళుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జైప్రకాష్‌రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, యుగంధరరెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాసులు, హనుమంతు, శ్రీరాములు, మహమ్మద్‌రఫీ, తహసీల్దార్ సీ.ఆర్. మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ కోటకు త్రివర్ణ శోభ





రంగినీమహల్‌కు మూడురంగుల విద్యుద్దీపాలంకరణ , కోట వద్ద పర్యాటకుల సందడి

గుర్రంకొండ: జిల్లాలో ఏకైక చారిత్రాత్మాక పురాతన కట్టడమైన గుర్రంకొండ కోట త్రివర్ణ శోభతో ఆకట్టుకుంది. ఆజాదీకా మహోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్రపురావస్తుశాఖ అధికారులు కోటలోని రంగినీ మహల్‌కు జాతీయ జెండాలోని మూడు రంగుల విద్యుద్దీపాల కాంతులను ఏర్పాటు చేశారు. దీంతో కోటలో పర్యాటకుల సందడి నెలకొంది. కోటలోని రంగినీ మహల్ ముందువైపు నుంచి చూస్తే రెండు అంతస్తులుగానీ, వెనుకవైపు నుంచి చూస్తే మూడు అంతస్తులుగా కనిపించడం ఈ మహల్ ప్రత్యేకత. దీంతో మహల్‌కు వెనుకవైపు ఉన్న మూడు అంతస్తులకు జాతీయ జెండాలోని మూడు రంగులు వచ్చే విధంగా విద్దీదీపాలంకరణ చేశారు. మొదటి అంతస్తు ఆకుపచ్చరంగు, రెండవ అంతస్తు తెలుపురంగు, మూడవ అంతస్తు ఎరుపురంగులో కనబడేలా ప్రత్యేకంగా దీపాలను అలకరించారు. దీంతో రంగినీ మహల్‌కు ప్రత్యేక కళ వచ్చింది. మహల్ మొత్తం మూడు రంగుల జాతీయ జెండా కనిపిస్తుండడం ఇక్కడి ప్రత్యేకతగా నిలుస్తోంది. రెండురోజుల పాటు ప్రతిరోజు సాయంకాలం 6.30 గంటల నుంచి 9.30 గంటల వరకు మూడురంగులు వెలుగుల శోభ ఏర్పాటు చేశారు. కోటలో మువ్వవన్నెల జెండా రంగుల విద్యుద్దీపాలంకరణ చేసిన విషయం ప్రసార మాధ్యమాల్లోహల్ చేస్తుండడంతో ఇక్కడి విశేషాలను చూడ్డానికి పెద్ద ఎత్తున పర్యాటకులు విచ్చేస్తున్నారు. దీంతో కోటలో సందడి నెలకొంది.